ఎబిఎస్‌వికెలో ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించారు. తేజ హాస్పిటల్ అధినేత డాక్టర్ పొన్నమండ చంద్రశేఖర్‌వర్మ అవసరమైన వారికి ఇసిజి, ఎకో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ వర్మ

వెట్టిచాకిరీ..!

పలు పనులతో విఒఎలు, ఆర్‌పిలు సతమతం
కనీస గుర్తింపు కరువు
కాల పరిమితి సర్క్యులర్‌తో అగమ్యగోచరం
పనికి తగ్గ వేతనాలు లేక అవస్థలు

ధర్నా శిబిరంలోనే నిద్రిస్తున్న విఒఎలు, ఆర్‌పిలు

ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా సంఘాల బలోపేతం.. మహిళల అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు (విఒఎ), రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పి) పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలు మహిళల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేస్తున్నప్పటికీ కనీస గుర్తింపు కరువైంది. ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రికలుగా చెప్పుకుంటున్న సచివాలయం, వాలంటీర్ వ్యవస్థల పనులు సైతం వీరు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వీరిపట్ల సానుకూల దృక్పథం చూపడం లేదు. ఇదిలా ఉంటే వైసిపి ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ తీసుకొచ్చి నెత్తిమీద పిడుగు వేసింది. ఈ నేపథ్యంలో గతం నుంచి పని చేస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సిబిఒ, హెచ్‌ఆర్ పాలసీ లేదు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు. తక్కువ సంఘాలుంటే మెర్జ్ చేయడం, బకాయిలు చెల్లించకపోవడం ఇలా అనేక సమస్యల మధ్య విఒఎలు, ఆర్‌పిలు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్)ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో విఒఎలు, ఆర్‌పిలు కన్వెన్ర చేసి 36 గంటల ధర్నాకు దిగారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, సిబిఒ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, విఒఎల మెర్జ్ ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ఇవ్వాలని, విఒఎలకు ఐడి ద్వారా పని కల్పించాలని, 15 సంఘాల్లోపు విఒఎలకు వేతనాలు చెల్లించాలని, మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్టపరిహారం అందించాలని, మహిళా మార్ట్‌ల్లో టార్గెట్ ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, పొదుపు సంఘాల మహిళలతో బలవంతపు కొనుగోళ్లు ఆపాలనేది వారి ప్రధాన డిమాండ్. ఈ డిమాండ్లతో వారు కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు.

బలవంతపు కొనుగోళ్లు ఆపాలి

ఎ.వరలక్ష్మి, రిసోర్స్‌పర్సన్, పైడిపర్రు

ఒకపక్క పని ఒత్తిడి, మరోపక్క వేధింపులు, ఇంకోపక్క సాధింపులు ఇవి చాలావు అన్నట్లు మహిళా మార్ట్‌ల్లో సరుకుల కొనుగోలుకు టార్గెట్లు ఇస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు, విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు వంటివి పొదుపు సంఘాల మహిళలతో బలవంతంగా కొనిపించాలని టార్గెట్లు పెడుతున్నారు. ఈ విధానాన్ని తక్షణం ఆపి గ్రేడ్ల పద్ధతిని కూడా నిలుపుదల చేయాలి.

విఒఎల మెర్జ్ ఆపాలి

గుంపుల పద్మకుమారి, యానిమేటర్, పసలదీవి

తక్కువ సంఘాలు ఉన్నాయనే పేరుతో విఒఎలను మెర్జ్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల వేలాది మంది విఒఎలు ఉపాధి కోల్పోతున్నారు. ఇది మానవ వనరులకు విఘాతం కల్గించడమే. ఉపాధికి నష్టం లేకుండా మెర్జ్ చేయడం ఆపాలి. అలాగే గతంలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదు. ప్రభుత్వం ఆ విధంగా ఆలోచన చేయాలే తప్ప ఉన్న ఉద్యోగాలను తొలగించాలని చూడటం దుర్మార్గం.

కనీస గుర్తింపు లేదు

సిహెచ్.వరలక్ష్మి, రిసోర్స్‌పర్సన్, వెంకట్రాయపురం

ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రభుత్వ పనులన్నీ చేస్తున్నాం. ఒక విధంగా చెప్పాలంటే వెట్టిచాకిరీ చేసినట్లే. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాక ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలను తరలించడం, సర్వేలు చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల పనులు కూడా మేమే చేస్తున్నాం. అయితే సచివాలయ వ్యవస్థ పనులు చేసిందని చెప్పుకుంటుందే తప్ప మాకు కనీస గుర్తింపు ఇవ్వట్లేదు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తాం

ఎ.నిర్మలాదేవి, ఎపి వెలుగు విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు

విఒఎలు, ఆర్‌పిలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. పనికి తగ్గ వేతనం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా దున్నపోతు మీద వర్షం కురిసినట్లుగా వ్యవహరిస్తుంది. మాకు వేతనం రూ.26 వేలు అందించాలి. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి. గ్రేడ్ల విధానం ఆపాలి. 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించాలి. విఒఎల మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలి. సమస్యల పరిష్కారానికి ఎంత దూరమైనా ప్రయాణిస్తాం. ఎటువంటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే చలో విజయవాడకు పిలుపునిస్తాం.

గ్రేడింగ్ పద్ధతి నిలిపివేయాలి

ఎన్.గోవిందమ్మ, యానిమేటర్, నాగిడిపాలెం

ప్రభుత్వం రకరకాల యాప్‌లు తీసుకొచ్చింది. కొన్నిసార్లు టెక్నాలజీలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమయంలో పనులు వెనుకబడుతున్నాయి. దీంతో పని పద్ధతులను గ్రేడ్లుగా విభజిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఉన్నతాధికారులు పనులు చేయడం లేదని ఒత్తిడి తీసుకొచ్చి మరింత ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో మానసికంగా ఇబ్బందులు ఏర్పడి అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

5జి ఫోన్లు అందించాలి

డి.ఝాన్సీ, యానిమేటర్, అత్తిలి

వివిధ యాప్‌లు, అనేక రకాల సర్వేలతో సతమతమవుతున్నాం. మా వద్ద ఉన్న ఫోన్లు నాసిరకంగా ఉండి పూర్తిస్థాయి టెక్నాలజీ అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. దీన్ని గుర్తించని అధికారులు తిరిగి మాపై పనులు చేయడం లేదని నింద వేసి పని ఒత్తిడికి గురి చేస్తున్నారు. యాప్ వర్క్ కోసం ప్రభుత్వమే 5జి మొబైల్‌ను అందిస్తే కొంతమేర ఉపశమనం లభిస్తుంది.

మాట్లాడుతున్న వీరపాండ్యన్

ధాన్యం కొనుగోలుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నాం

పౌర సరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి జి.వీరపాండ్యన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు, రైతుల నుంచి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు జిల్లాకు వచ్చినట్లు రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి జి.వీరపాండ్యన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్.అగ్రహారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. జిపిఎస్ ట్రాకింగ్ విధానాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు చేరే వరకు వాహనాన్ని ట్రాక్ చేస్తామని చెప్పారు. అనంతరం తాడేపల్లిగూడెం మున్సిపల్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి వీరపాండ్యన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసేలా సిఎం జగన్ ప్రతిఒక్క అంశాన్ని రైతుల పక్షాన ఆలోచించి దిశా నిర్దేశం చేశారన్నారు. రైతులకు ఏ విధమైన సమస్య వచ్చినా నిస్సందేహంగా అధికారులకు తెలియజేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తేమ శాతం, తూకం యంత్రాలను, డేటా ఎంట్రీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు సిబ్బందికి సూచనలు చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిమిత్తం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. గత రబీ, ఖరీఫ్ సీజన్లో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టమన్నారు. రైతుల నుంచి కూడా స్వయంగా సమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫిర్యాదులు చేసేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను ఎప్పటికప్పుడు అందజేయనున్నట్లు జెసి చెప్పారు. సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిసిఒ ఎం.రవికుమార్, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఉండి

వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి యు.రవిప్రకాష్

ద్విచక్ర వాహనంపై ప్రయాణంలో ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ వాహనదారులను హెచ్చరించారు. ఉండి రైల్వేగేట్ సమీపంలో ఎస్ఐ కె.గంగాధర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హెల్మెట్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని, లేనిపక్షంలో వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ వాడకం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో తరచూ హెల్మెట్ డ్రైవ్ నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య భారీగా తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాడితేనే ఫలితం సాధ్యం

విఒఎల ధర్నాలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి)

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

కాగితాలతో కరిగిపోయే రాజకీయ నాయకులు లేరని, పోరాడితేనే మన హక్కులను సాధించుకోగలమని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద డ్వాక్రా యానిమేటర్ల సమస్యలపై ఎపి ఐకెపి విఒఎలు, ఆర్‌పిలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 36 గంటల ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుండి పెద్దసంఖ్యలో విఒఎలు, మెప్మా ఆర్‌పిలు తరలొచ్చారు. ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ మన హక్కులను మనమే పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతి మాటలో దగా, మోసం ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో విఒఎల జీతం రూ.పది వేలకు పెంచుతానని హామీ ఇచ్చి నేటికీ రూ.ఎనిమిది వేలే ఇవ్వడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి తాను 30 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలిస్తానని చెబుతున్నాడని, అయితే మన ఉద్యోగాలను మూడు సంవత్సరాలకు మార్చే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజులకే సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఉపాధ్యాయులకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి జిపిఎస్ తీసుకొచ్చి మోసగించారన్నారు. రూ.ఎనిమిది వేలు వేతనమూ సక్రమంగా అందించట్లేదని, కొన్ని ప్రాంతాల్లో ఇంకా 15 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. విఒఎలకు, ఆర్‌పిలకు ఆరు నెలల ప్రసూతి సెలవు ఎందుకివ్వరని ప్రశ్నించారు. యూనిఫామ్, సెల్ ఫోన్లు ఇవ్వకుండా యాప్‌ల పేరు చెప్పి వేధిస్తున్నారని, దీంతో స్కీమ్ వర్కర్లపై పని ఒత్తిడి పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను చెప్పుకునేందుకు నిరసనలు చేపడుతుంటే సిఎం జగన్మోహన్‌రెడ్డి జిఒ నెం.1 తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 51 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అయినా ప్రభుత్వం డిఎస్‌సి ప్రకటించడం లేదని విమర్శించారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్ల న్యాయ మైన సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు అందిస్తూ, డ్వాక్రా గ్రూపుల్ని ఏర్పాటు చేసి మహిళలను చైతన్యపర్చడంలో యానిమేటర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కుటుంబాలను, పిల్లలను వదిలిపెట్టి విఒఎలు 36 గంటల ధర్నాకు సిద్ధపడ్డారన్నారంటే సమస్యలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఎన్నికలు, ఓట్లు, కేసులు తప్ప ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పట్టడం లేదని, రానున్న కాలంలో గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ.నిర్మలాదేవి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడ తప్పదని అన్నారు. కార్యక్రమానికి శ్రామిక మహిళ నాయకురాలు డి.కళ్యాణి, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, తెలగంశెట్టి సత్యనారాయణ, ఝాన్సీ, గుంపుల పద్మ కుమారి, గోవిందమ్మ, ధనలక్ష్మి, వాకలపూడి రత్నం, పద్మావతి తదితరులు నాయకత్వం వహించారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ఇష్టపడి చదవాలి: ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

మాట్లాడుతున్న ఎస్‌కె.సాబ్జీ

చక్కని లక్ష్యాలతో ఇష్టపడుతూ చదివి ఉన్నత స్థానానికి చేరేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. మంగళవారం మండలంలోని తేతలి హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయునిగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యాబోధన, పాఠశాలలో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బిఎం.గోపాలరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి యుటిఎఫ్ భవన నిర్మాణానికి రూ.25 వేలు, పాఠశాలకు ఒక కంచు గంట ఎంఎల్‌సి సాబ్జీ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రంగయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్, నాయకులు పిల్లి విష్ణుమూర్తి, కె.పుల్లారెడ్డి, సుధారాణి, అనురాధ, గంగాభవాని, రామకృష్ణ, ప్రశాంతి, ప్రకాశరావు, జె.బుచ్చియ్య, కె.శ్రీనివాసు, జె.రాజకుమారి, ఎం.సూర్యచంద్రకుమారి, జి.దుర్గారావు పాల్గొన్నారు.

శరవేగంగా భీమవరం అభివృద్ధి

విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శంకుస్థాపన చేస్తున్న గ్రంధి

భీమవరం పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పదో వార్డులో రూ.40 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ గత నాలుగేళ్లలో భీమవరం పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రతి వార్డులో కూడా ప్రజల సూచన మేరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులో పూర్తిస్థాయిలో అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి అంటే భీమవరం నియోజకవర్గమని, దీనిలో ఎటువంటి సందేహమూ లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు సంబంధించి కోట్లాది రూపాయల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిచామని, త్వరలోనే వాటికి ఆమోదం లభిస్తుందని తెలిపారు. నాడు-నేడు కింద పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలను జాతీయస్థాయి ప్రమాణాలతో అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని, ఈ నిర్మాణం పూర్తయితే అన్ని విభాగాల స్పెషలిస్టులు కూడా ప్రజలకు అందుబాటులోకి వస్తారని అన్నారు. మరోపక్క టిడ్కో గృహాల సముదాయంలో ప్రజల వాడకపు నీటిని శుద్ధి చేసి కాలువలకు వదిలేలా నిర్మిస్తున్న ఎస్‌టిపి ప్లాంట్ పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఇ త్రినాధరావు, వార్డు ఇన్‌ఛార్జి కానుబోయిన వెంకటరమణ, నందమూరి ఆంజనేయులు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, పట్టణాధ్యక్షులు తోట భోగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎఎస్.రాజు, కోడె యుగంధర్, బొక్కా గోపి, చెల్లంకి గిరి, వేండ్ర విజయదుర్గ, బొత్స ధర్మారావు, సోమాదుల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే ప్రభుత్వ పాలన

గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తున్నారని గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లోసరిలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చామని, లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం జరుపుకుని సొంతింటి కల నిజం చేసుకోవాలని అన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిమిత్తం రూ.36 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, పంచాయతీరాజ్ డిఇ జిజస్వామినాయుడు, సర్పంచులు రామాని శివాజీ వర్మ, జల్లా కొండయ్య, తిరుమాని శ్రీనివాస్, నాగిడి నారాయణస్వామి, ఎంపిటిసిలు బొమ్మిడి కొండరాజు, కొప్పర్తి సత్యనారాయణ, యాతం సాయి, రామాని క్యాస్ట్రో వర్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

మాట్లాడుతున్న కోనాల భీమారావు, పక్కనే సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, వామపక్ష నేతలు

లేనిపక్షంలో గుణపాఠం తప్పదు
12 నుంచి కరపత్రాలు పంపిణీ
15న ప్రజాబ్యాలెట్ నిర్వహణ
వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. లేనిపక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే వైసిపి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించింది. విపరీతంగా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై మరింత భారాన్ని మోపిన వైసిపి ప్రభుత్వ నిరంకుశ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు స్పష్టం చేసింది. దీనిలో భాగంగా ఈ నెల 12 నుంచి 14 వరకు కరపత్రాల పంపిణీ చేపట్టి విస్తృత ప్రచారం నిర్వహించాలని, 15న ప్రజాబ్యాలెట్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై ఎటువంటి భారాలు మోపబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలపై విపరీతమైన భారాలను మోపిందన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకపక్క పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతుంటే మరోపక్క ట్రూఅప్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలు సామాన్యులకు గోరుచుట్టుపై రోకలిపోటులా తయారయ్యాయన్నారు. పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అత్యంత దుర్మార్గంగా ఉందని విమర్శించారు. ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధీ చేయాలని, ముఖ్యంగా భారాలు వేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల్లేవు, అభివృద్ధి లేదు, రోడ్లు లేవు, ఉపాధి లేదుగానీ ధరలు మాత్రం విపరీతంగా పెంచి సామాన్యులను బతకలేని దుస్థితిలోకి నెట్టివేసిందన్నారు. ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి రొంగల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 12 నుండి వామపక్షాల ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రచారం చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, సిపిఐ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తపాలా శాఖ సేవలు వెలకట్టలేనివని భీమవరం హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎస్ సిహెచ్.ఆదిత్యలు తెలిపారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక, తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత ప్రభుత్వ తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా కెజిఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో తపాలా శాఖ సంక్షేమ పథకాలు విద్యార్థులకు సంబంధించిన పోస్టల్ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్ బాబు మాట్లాడుతూ మహిళ సమ్మాన్, సేవింగ్ సర్టిఫికెట్స్, 21 ఏళ్ల సుకన్య సమృద్ధి స్కీమ్ పథకాలు విశేషంగా సమాజంలో నడుస్తున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పోస్టల్ స్కీమ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ.రామచంద్రమూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సుధాకర్, జ్యోతి, అరసవల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డాడీస్ రోడ్డు యాప్ ఉపయోగకరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వాహనదారులకు, బాటసారులకు భద్రత కల్పించే విధంగా డాడీస్ రోడ్డు యాప్ ఎంతో ఉపయోగపడుతుందని భీమవరం ట్రాఫిక్ సిఐ దాస్ అన్నారు. మంగళవారం ఆర్ఆర్ డిఎస్ ప్రభుత్వ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన, డాడీస్ రోడ్డు యాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ట్రాఫిక్ సిఐ దాస్ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వాడాలన్నారు. పోలీసులు వాహనాన్ని ఆపినప్పుడు ఈ యాప్ ద్వారా అన్ని రికార్డులు చూపించవచ్చన్నారు. సుమారు 8 రకాల సౌకర్యాలున్నాయన్నారు. డాడీస్ రోడ్డు డైరెక్టర్ వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పి.అమూల్యరావు, గౌతమ్ పాల్గొన్నారు.

19, 20వ తేదీల్లో ఎస్ఆర్‌కెఆర్‌లో 'ఏక్తాన్'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 19, 20 తేదీల్లో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాక్ ఓవర్ ఫ్లో -2 కె 23, పేరిట 24 గంటల ఏక్తాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థుల తమ నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏక్తాన్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాల కోడింగ్ క్లబ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మౌలిక వసతులు కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం పొందినవారు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని హౌసింగ్ ఎఇ కెవిఎస్.శ్రీమచంద్రమూర్తి లబ్ధిదారులను కోరారు. మంగళవారం వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇంటిని నిర్మించుకుంటామని ముందుకొచ్చి ఆ తరువాత వెనకడుగు వేస్తే మంజూరైన ఇళ్లు పెండింగ్‌లో ఉండిపోతాయన్నారు. తప్పని సరిగా నిర్మించుకుంటామనే వారు పేర్లు ఇస్తే మంజూరు చేయిస్తామన్నారు. అయితే జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తామని పలువురు లబ్ధిదారులు ఎఇకి తెలిపారు. తమకు కేటాయించిన లే అవుట్లలో మరికొంత పూడిక చేయాలని లేని పక్షంలో అంతలోతట్టు ప్రాంతంలో ఇంటి నిర్మాణం చేయాలంటే ఖర్చులు తట్టుకోలేమని లబ్ధిదారులు తెలిపారు. తమకు కేటాయించిన స్థలాలు పొజిషన్ చూపలేదని ఎవరి స్థలం ఎక్కడుందో చూపాలన్నారు. లబ్ధిదారులు చెప్పిన అంశాలన్నీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని మండల సర్వేయర్ శైలజ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచి చికిలే మంగతాయారు, వర్క్ ఇన్‌స్పెక్టర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

28వ రోజుకు టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 28వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేయకుండా చంద్రబాబును అక్రమంగా జగన్ ప్రభుత్వం జైల్లో పెట్టిందని, వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆచంట : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 28వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నేతలు పాల్గొన్నారు.

శశిలో ఓరియంటేషన్ క్లాసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం రెండు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సమయపాలన ఆవశ్యకత, సరైన దృక్పథం కలిగి ఉండటం, నిర్దేశ లక్ష్యాలను ఏర్పరచుకోవడంతో పాటు, మంచి వ్యక్తిత్వం అలవర్చుకోవాలన్నారు. వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడారు. అనంతరం కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాల్‌కృష్ణ, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు మాట్లాడారు.

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు తెలిపారు. కాళ్లకూరులో మేరీమాత విగ్రహం ఏర్పాటు చేసి 14 సంవత్సరాలైన సందర్భంగా మేరీమాత ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు ప్రారంభించారు. వేల మందికి అన్నదానం నిర్వహించారు. అనంతరం దాట్ల వెంకట రామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య, శివాజీ రాజు, కాళ్లకూరు సొసైటీ ఛైర్మన్ మాదు సురేష్ పాల్గొన్నారు.

మత్స్యపురిపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ స్టాల్

ప్రత్యేక ఆకర్షణగా అంగన్‌వాడీ స్టాల్

ప్రజాశక్తి - వీరవాసరం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వద్ద ఏర్పాటు చేస్తున్న అంగనవాడీ పోషకాహార స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అంగన్‌వాడీలు తయారు చేసిన రాగిజావ ఇక్కడకు వచ్చిన ప్రతి వారిచే తాగిస్తున్నారు. జావ తాగినవారు దాని తయారీ విధానాన్ని వారి నుంచి తెలుసుకుంటున్నారు. ఎంతో రుచిగా ఉన్న ఈ రాగి జావ పట్ల పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతి ఒక్కరూ రాగిజావా తాగారా అంటూ తాగకపోతే తాగుతావా అంటూ ఒకరినొకరు అడుగుతున్నారంటే దాన్ని ఎంత రుచిగా తయారు చేసి అందిస్తున్న అంగన్‌వాడీలపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అంగన్‌వాడీల కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతంతో వివిధ రకాల వంటలు ఎలా తయారు చేసుకోవచ్చు, వాటి రుచి ఎంత అమోఘంగా ఉంటుందో తెలియజేస్తూ స్టాల్స్‌లో వంటకాల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. మంగళవారం మత్స్యపురిపాలెంలో అంగనవాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఈ స్టాల్‌ను మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, దూసనపూడికి చెందిన అంగనవాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు వై.వెంకటలక్ష్మి, సిహెచ్.ఎస్తేరురాణి, కె.భాగ్యలక్ష్మి, ఐ.వరలక్ష్మి తెలిపారు. ఈ స్టాల్‌ను సందర్శించిన సూపర్‌వైజర్లు డి.గీతా, వి.కనకమహాలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రజారోగ్యం కోసమే ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం కెపి.పాలెంసౌత్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమాల్లో సర్పంచులు అందే వెంకటలక్ష్మి, కడలి సోంబాబు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాలకోడేరు : ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న పివిఎల్ నరసింహరాజు

ఉండి : జగనన్న ఆరోగ్య సురక్షతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ నెరవేరుతుందని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. వాండ్రం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ, ఎంపిటిసి పెన్మెత్స ఆంజనేయరాజు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు పాల్గొన్నారు.

వీరవాసరం: ఇంటి వద్దకే పథకాలతో పాటు గ్రామం ముంగిటకే వైద్యం అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. మత్స్యపురిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం కోటిపల్లి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు వైద్యం ఖరీదైన నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనారోగ్య సమస్యలను గుర్తించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి కురెళ్ల వెంకట పద్మావతి, వైస్ ఎంపిపి చిలకపాటి ప్రకాశం, వైసిపి నాయకులు కర్రా ప్రకాషరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు సక్రమంగా అందజేస్తే సామాన్యులు ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లరని డిఆర్‌ఒ కె.కృష్ణవేణి తెలిపారు. ఓడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒపిలు ఎక్కువగా వైద్య సిబ్బంది దగ్గర ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బుర్రా రవికుమార్, మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ రామస్వామి, ఎంపిడిఒ పి.పద్మజ, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, ఉప సర్పంచి ఇందుకూరి సాయి సుబ్బరాజు పాల్గొన్నారు.

కాళ్ల : ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు అన్నారు. మాలవానితిప్పలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎంఎస్ ప్రభాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సిహెచ్ హేమలత, మంతెన రంగరాజు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వం ఉద్దేశమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గొల్లలకోడేరులో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు), ఉండి ఎఎంసి ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్రకుమార్‌తో కలిసి పివిఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో వైద్య ఆరోగ్యశాఖ అంగన్‌వాడీలు ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించిన వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పివిఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సంక్షేమంతో పాటు ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎఎంసి వైస్ ఛైర్మన్ రాజా నరేంద్ర కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుక్కల లక్ష్మి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు, బొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. వల్లూరు పంచాయతీ పరిధి మట్టపర్తివారిపాలెం కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జితేంద్ర, రామాంజనేయులు వేణుబాబు సత్యవతి పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ - 1 మెయిన్ గ్రామ సచివాలయానికి సంబంధించి టిటిడి కళ్యాణ మండపం వద్ద ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. అనంతరం అంగన్ వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు.

పాలకొల్లు రూరల్ : దిగమర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదవాడికి ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన మహోన్నత వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి గ్రామ సర్పంచి రాపాక నగేష్ కరుణాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సునిబాబు, ఎంపిడిఒ పాల్గొన్నారు.

సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఆచంట

మండల సర్వసభ్య సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ హాజరై మాట్లాడారు. ఎన్నికల వరకే పార్టీలని, ఎన్నికలైన తర్వాత పార్టీలతో చూడకుండా అభివృద్ధి వైపు చూడాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్

ముఖ్యంగా వైద్యాధికారులు మండల సమావేశానికి ఎప్పుడూ రాకుండా కేవలం సూపర్‌వైజర్లను మాత్రమే సమావేశాలకు పంపడం సరికాదని హెచ్చరించారు. వైద్యాధికారులతో ఫోన్లో మాట్లాడి వివరణ కోరారు. మండల సమావేశంలో రికార్డు తప్పనిసరిగా రాయాలన్నారు. సమావేశంలో వచ్చిన సమస్యలను ఎంతవరకూ పరిష్కరించామని, తదుపరి సమావేశానికి ఈ సమావేశంలో చర్చించుకున్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని ఆయన సూచించారు. దాళ్వాలో రైతులు చాలా నష్టపోయారని ముఖ్యంగా గోనె సంచుల కొరత, తేమ శాతం వల్ల అనేక ఇబ్బందులకు గురయ్యారని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతుల దగ్గర డబ్బులు వసూలు చేశారని జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్‌పిటిసికి మండల పరిషత్ కార్యాలయంలో కనీసం కూర్చోవడానికి ఛాంబర్ కూడా ఏర్పాటు చేయలేదని, టిడిపి జెడ్‌పిటిసి అయినందువల్ల తనను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు రాకుండా చేయడం, వచ్చినా వాటిని ఉపయోగించకుండా ఎంఎల్‌ఎ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎఇఒ నాగరాజు తెలిపారు. భీమలాపురం, వల్లూరు సర్పంచులు మాట్లాడుతూ సర్పంచులుగా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు తమ చేతులతో లబ్ధిదారులకు ఒక్క పెన్షన్ కూడా ఇప్పించకుండా వివక్ష చూపుతున్నారన్నారు. ఆచంట నుంచి సిద్ధాంతం రహదారి అధ్వానంగా ఉందని, ఆ రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలని సభ్యులు ఆర్‌అండ్‌బి ఎఇని నిలదీశారు. ఎఇ ప్రసాద్ మాట్లాడుతూ రూ.16 లక్షల నిధులు మంజూరయ్యాయని వీటిలో ఏడు మీటర్లు దేవ వరకు రహదారి వెడల్పు చేశామని తెలిపారు. మరో 600 మీటర్ల సీసీ రోడ్డు పూర్తి చేశామని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో తొమ్మిది సార్లు కరెంట్ బిల్లు పెంచారని, తక్షణం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని జెడ్‌పిటిసి సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సుగుణ సంధ్య, మండల ఉపాధ్యక్షులు ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు.. ఘోరాలు..

ఆకివీడులో భారీ చోరీ

40 కాసుల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులోని రైల్వే క్యాబిన్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు 40 కాసుల బంగారం, రూ.10 లక్షల నగదును దుండగులు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం. ఆకివీడుకు చెందిన కొల్లిపర యుగంధర్ బాబు చేపల వ్యాపారం చేస్తుంటాడు. అతని భార్య సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లింది. అయితే యుగంధర్ బాబు చేపలు కొనుగోలు, ఎగుమతి చేసేందుకు అక్కడికి రెండు కిలో మీటర్ల దూరం వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి అర్ధరాత్రి 2 గంటలైంది. ఇంటి తాళాలు, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉండడాన్ని గమనించాడు. సుమారు 40 కాసుల బంగారు ఆభరణాలు, 10 లక్షలు రూపాయలపైబడి నగదు పోయిందని సిఐ సత్యారాయణకు సమాచారం అందించాడు. సిఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగబాబు, డిఎస్‌పి త్రినాథ్, క్రైమ్ డిఎస్‌పి ఫణీశ్వరరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై దాడి

14 మంది అరెస్టు - రూ.49 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - పాలకోడేరు

వరల్డ్ కప్ నేపథ్యంలో మోగల్లులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. 14 మంది బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.49 వేల నగదు, 11 సెల్‌ఫోన్లు, ఎల్ఇడి టివిని స్వాధీనం చేసుకున్నారు. మరో 11 మందికి క్రికెట్ బెట్టింగ్‌లో భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి పాలకోడేరు పోలీస్ స్టేషన్లో భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్, ఎస్ఐ నాలం శ్రీనివాసరావుతో కలిసి భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి మోగల్లులోని పాత ముద్దాయిలైన చేబోలు ప్రసాద్ అలియాస్ పవన్ ఇంటిపై దాడి చేయగా, అల్లూరి సీతారామరాజుతో కలిసి వరల్డ్‌కప్ క్రికెట్ పోటీలకు సంబంధించి బెట్టింగులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు మరో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రసాద్ నుంచి ఎల్ఇడి టీవీ, రూ.42 వేల నగదు, సీతారామ రాజు నుంచి రూ.7 వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విచారణ చేయగా దొమ్మేరు గ్రామానికి చెందిన బండారుపల్లి నవీన్ అలియాస్ వర్మకు వీరికి బెట్టింగ్‌కు సంబంధించి తస్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అలాగే ఈ బెట్టింగ్‌లో మరో 11 మందికి భాగస్వామ్యం ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి - గణపవరం

ఇల్లు ఎవరికి చెందుతుందనే విషయంలో గొడవపడి భర్త భార్యను పచ్చడి బండతో కొట్టి చంపిన ఘటన మంగళవారం అప్పన్నపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పన్నపేటకు చెందిన తోట వెంకటేశ్వరరావు (60), తోట రమాదేవి (రమ)ని 20 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నారు. అంతకుముందు వీరికి వేరే వాళ్లతో వివాహమై విడిపోయారు. మూడు సంవత్సరాల క్రితం వెంకటేశ్వరరావు మొదటి భార్య నాంచారమ్మ అప్పన్నపేట వచ్చి వెంకటేశ్వరరావు పేరిట ఉన్న ఇల్లు తనకే చెందుతుందని రమాదేవితో గొడవకు దిగింది. అప్పటి నుంచి ఇంటి విషయమై వెంకటేశ్వరరావు, నాంచారమ్మ, రమాదేవి నడుమ వివాదం సాగుతోంది. మంగళవారం ఉదయం ఇంటి విషయంలో మళ్లీ వివాదం తలెత్తింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన వెంకటేశ్వరరావు పచ్చడి బండతో రమాదేవి తలపై బలంగా మోదాడు. దీంతో రమాదేవి తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితికి చేరింది. స్థానికులు హుటాహుటీన తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే రమాదేవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, గణపవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం రూరల్ ఎస్ఐ ఎస్‌విఎస్.మూర్తి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరరావు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

అనారోగ్యంతో ఎఎన్ఎం మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న జుత్తిగ గ్రామానికి చెందిన సెకండ్ ఎఎన్ఎం మల్లిపూడి కస్తూరి (51) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, సిఐటియు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుబాటి జ్యోతి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు వాడపల్లి వెంకటరత్నం (గాంధీ), కోడె శ్రీనివాస్ ప్రసాద్, ఆశా వర్కర్లు సంఘీభావం తెలిపారు.

ఇకెవైసి చేయించకుంటే బీమా వర్తించదు

ప్రజాశక్తి - అత్తిలి

ఇకెవైసి నమోదు ముగిసిందని ఎఒ టికె.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి చేయించుకోని వారికి ధాన్యం కొనుగోలు, రైతుభరోసా, పిఎం కిసాన్, పంట నష్ట పరిహారం, పంటల బీమా వర్తించవని తెలిపారు. దగ్గరలోని ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించి ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

జివిఎస్‌విఆర్‌ఎంలో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 గంగాధర్ శర్మ హాజరయ్యారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఎ-2 ప్రశ్నాపత్రాలను పరిశీలించి, ప్రగతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థులందరూ ఏకరూప దుస్తులు, షఉస్, సాక్సు బెల్టులు ధరించి, పాఠశాలకు సమయపాలన పాటించి, విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేటట్లు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనంలో రాగి జావ, గుడ్లు ఉండేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగులను అవహేళన చేయొద్దు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైకల్యం ఉన్నవారు కూడా అందరితో సమానంగా జీవించే హక్కు ఉందని, వారిని అవహేళన చేయడం నేరమని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేదాల నాగరాజు చెప్పారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా అంజలి పాఠశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వికలాంగులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గూడపాటి సత్య, పిట్ట రాజ్ కుమార్, కెబి.శ్రీనాథ్, ఎంబి.రాజు, కె.ఆశాజ్యోతి, ఆర్.హిమబిందు పాల్గొన్నారు.

'దళిత కుటుంబాల్లో వెలుగులు'

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో దళిత కుటుంబాల్లో వెలుగులు నింపింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు తెన్నేటి కిషోర్ మాదిగ అన్నారు. జిన్నూరు పంచాయతీ చాకిరేవుగుంటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా దళితుల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. నాడు-నేడు స్కూళ్ల అభివృద్ధి ద్వారా దళిత బిడ్డలు ఉన్నత చదువులు చదువుకోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెన్నేటి చిన శామ్యూల్, డి సురేష్, కుసుమే కిరణ్, సుజీరరావు పాల్గొన్నారు.

సూర్యలో మెగా జాబ్‌మేళా

నరసాపురం: నరసాపురంలోని సూర్య కళాశాలలో ఈ నెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మంగళవారం తెలిపారు. సూర్య కళాశాలలు, వికాస్ వారి ఆధ్వర్యంలో మల్టీ నేషనల్ కంపెనీలు టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంక్, డెక్కన్ క్రానికల్, ఇన్నోవా, సోలార్‌తోపాటు మరో 10 కంపెనీలు ఈ జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని ఆయన తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించిన ఉద్యోగ మేళాలో విద్యార్హత ధృవపత్రాలు ఆధార్ కార్డులతో హాజరుకావాలని సూచించారు.

కావలెను
ప్రజాశక్తి దినపత్రికకు దిగువ కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఏలూరు కల్చరల్, ఏలూరు సిటీ, భీమవరం టౌన్, తాడేపల్లిగూడెం టౌన్, నరసాపురం అర్బన్, తణుకు టౌన్, నూజివీడు టౌన్
రూరల్ : జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, వేలేరుపాడు, కుక్కునూరు, కెఆర్.పురం ఐటిడిఎ, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు
విద్యార్హత: ఇంటర్
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఎడివిటి ఇన్‌ఛార్జి: నూజివీడు
మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
ఇంటర్వ్యూ తేదీ:
14-10-23 శనివారం ఉదయం పది గంటలకు
ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్స్
సెల్: 9949366196, 8919170815, 9490099168

ఘనంగా ఆర్‌కె నారాయణ జయంతి

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో ప్రముఖ ఆంగ్ల రచయిత ఆర్‌కె నారాయణ జయంతినిమంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. సభలో కాలేజీ లెక్చరర్ అక్కిరాజు మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజల జీవన విధానానికి అద్దం పెట్టే రచనలను ఆర్‌కె నారాయణ రచించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనురాధ భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగుమతుల ప్రోత్సాహానికి డిఇహెచ్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఎగుమతులను ప్రోత్సహింతడానికి డిస్ట్రిక్ హెజ్ ఎక్స్పోర్ట్ హబ్ (డిఇహెచ్) కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించి ఎగుమతిదారులు, స్థానిక పారిశ్రామికవేత్తలతో భాగస్వాముల సంప్రదింపుల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎక్స్పోర్ట్ ప్రొమిషన్ సంయుక్త సంచాలకులు జిఎస్.రావు, జిల్లా పరిశ్రమల అధికారి వి.ఆదిశేషు, ఎఫ్ఐఇఒ సహాయ సంచాలకులు జి.రఘునాధబాబు, జిల్లాలోని ఆక్వా పరిశ్రమలు, కొబ్బరి పీచు పరిశ్రమలు, నరసాపురం లేస్ తయారీదారులు కార్యక్రమాల్లో పాల్గొని ఎక్‌పోర్ట్ ప్రొమిషన్ సంయుక్త సంచాలకులు ఎగుమతులకు గల అవకాశాలను, వాటిని అందిపుచ్చుకునే విధానాన్ని వివరించారు. జి.రఘునాధబాబు, ఎఫ్ఐఇఒ ఎగుమతిదారులకు అందించే సేవలు తెలిపారు. ఎగుమతిదారులు, పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేసి, వారి సలహాలు, సూచనలు జిల్లా ఎగుమతుల ప్రణాళికలో పొందుపరుస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోండి

మొగల్తూరు: మహిళలు ఆర్థికంగా బలపడేందుకు వైసిపి ప్రభుత్వం అనేక పథకాల అమలు చేస్తోందని చీఫ్‌విప్ ముదునూరు ప్రసాదరాజు డ్వాక్రా సభ్యులకు సూచించారు. మంగళవారం కెపిపాలెం సౌత్ సచివాలయంలో డ్వాక్రా సంఘం సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఎపిఎం సుభాషి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కడలి గంగాభవాని, సర్పంచి అందే వెంకటలక్ష్మి జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

గణపవరం: గణపవరం పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులకు ప్రతినెలా 9, 10 తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి తెలిపారు. మంగళవారం పిహెచ్‌సిలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 69 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. అనంతరం గర్భిణులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ ఒ.జాలాది విల్సన్‌బాబు, హెచ్‌వి.పద్మజ, హెల్త్ అసిస్టెంట్లు, ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నం. 256/2023
పసుపులేటి మౌనిక వగైరా ...వాదులు
మరియు
పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి: సూర్యనారాయణ, డో.నెం.16-13, రామచంద్రరావుపేట, పెనుగొండ, పెనుగొండ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...ప్రతివాది
పై నెంబరు దావాలో వాదులు పసుపులేటి మౌనిక మరియు పసుపులేటి సోహిత్ గార్లు ఏకస్థులై ప్రతివాది వారి తండ్రి గారు అయిన పసుపులేటి శ్రీనివాసరావు తండ్రి: సూర్యనారాయణ గారి పై కుటుంబ ఆస్తి పంపకం నిమిత్తం ఓ.యస్.నం. 256/2023 దావాను ధాఖలు చేయగా సదరు ప్రతివాది పసుపులేటి శ్రీనివాసరావు సమను అందుకోకుండా తప్పించుకొను చున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశాలు ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. సదరు ప్రతివాది పసుపులేటి శ్రీనివాసరావు **ది.19-10-2023 సం॥రం తేదీన ఉదయం 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరై మీ ఆక్షేపణలు విన్న వించుకోవలెను.** లేని యెడల మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలియజేయడమైనది.
వెలిచేటి గోవిందారావు
వాదులు తరపు న్యాయవాది
తణుకు, పః॥గో॥జిల్లా.
తణుకు,
10-10-23.
సెల్: 98491 22938

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 25/2018
ఇన్ ఓ.యస్.నెం. 149/2013
బిట్వీన్:
సత్తి రజనీకుమార్ రెడ్డి
...పిటీషనరు /డి. హెచ్.ఆర్
మరియు
రెడ్డి సూర్యచంద్రరావు వగైరా
...రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్
పై నెంబరు డిక్రీ బాకీకి గాను రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్ కు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గలట్టి ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.30-10-2023 సం॥రం తేదీ ఉదయం గం॥ 10:30 ని॥ల లగాయితూ పై కోర్టు వారి ఎదుట వేలం వేయుదురు.** గాన పాడుకొనదలచిన వారు శ్రీ కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.
షెడ్యూలు ఆస్తి వివరము
పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట పంచాయితీ లోని ఆర్.యస్.నెం. 1218రులో య.1-00ట్లు తాడేపల్లిగూడెం సబ్ డివిజన్‌లోని ఆస్తికి హద్దులు: **తూర్పు:** విక్రయదారుగారి ఆర్.యస్.నెం. 1218లో మిగిలిన ఆస్తి. **దక్షిణం:** సుంకవల్లి భాస్కరరావు గారి భూమి. **పడమర:** ఆర్.యస్.నెం. 1215లో కొండ్రెడ్డి ప్రసన్న కుమార్ గార్కి అమ్మిన భూమి. **ఉత్తరం:** ఏలూరు కాలువ.
పై హద్దుల మధ్య య. 1-00ట్లు జిరాయితీ భూమికి సమస్త ఈజ్‌మెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ విలువ : రూ.12,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.14,00,000/-
పి.ఆంజనేయరాజు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
సెల్: 98480 18256